త్రైలోక్యగీత - షష్ఠాధ్యాయః
ఆరవ అధ్యాయము
త్రిమత సమన్వయ యోగము

త్రైలోక్యా ఉవాచ:-

గురు త్రయస్య సిద్ధాంతాః , కే కే దత్త? జగద్గురో! |
తేషాం సమన్వయః కశ్చ, బ్రూహి త్వం గురురాజ మామ్ ||6.1||

[కుమారి త్రైలోక్య అడిగింది:- విశ్వగురువైన ఓ దత్త! గురువులందరిలో రారాజువు! ముగ్గురు దివ్య ఆధ్యాత్మిక గురువులైన ఆదిశంకరులు, రామానుజులు, మధ్వులు బోధించిన దేమి? వారు బోధించిన మూడు వేర్వేరు సిద్ధాంతములను మీరే విధంగా సమన్వయం చేశారు? దయతో నాకు తెలుపగలరు.]

శ్రీ శ్రీ శ్రీ దత్త స్వామీ ఉవాచ:

ఉక్తం తత్త్వం గురోః కాలే, శంకరస్య హి నాస్తికాః |
స గురుస్తద్ధితార్థాయ, కేవలం పండితో న యత్ ||6.2||

[**శ్రీశ్రీశ్రీ దత్త స్వామి** వివరించారు:-
దివ్య అవతారములు ఆయా కాలములలో ఉన్న శిష్యుల పరిస్థితిననుసరించి, ఎల్లప్పుడు సాధారణ బోధకుని వలె, సాధారణ గురువు వలె మాత్రమే ప్రవర్తిస్తారని, జ్ఞాని వలె శుద్ధమైన సత్యమునే పలుకరు అని **నేను** ఇదివరకే నీకు చెప్పాను. ఆదిశంకరులు వచ్చినప్పుడు ఈ జగమంతా పూర్వ మీమాంస మతము, బౌద్ధమతము లాంటి నాస్తిక మతములతో నిండి ఉండినది. శంకరులు అప్పుడు ఒక గురువు వలె ప్రవర్తించి ఆ నాస్తికులను అందరినీ సరైన మార్గములో నడిపించినారు. సత్యగ్రహణములో అశక్తులైన వారికి వేదజ్ఞాని వలె వేదములలో

నున్న శుద్ధసత్త్వమును మాత్రమే బోధించలేదు. అట్లు బోధించినచో ఏ ప్రయోజనమూ ఉండదు.]

నాంగీకుర్యా న్నాస్తిక స్తం, స బ్రహ్మ న పరా గతిః |
జీవో బ్రహ్మేతి స ప్రాహ, నాస్తికస్య స చాస్తి తత్ ||6.3||

[నాస్తికుడు ఎప్పుడూ, వేరేవానిని భగవంతుడని నమ్మని భావన యందు దృఢమైన విశ్వాసం కలిగి ఉంటాడు. కావున వేరే దారిలేక నాస్తికునికి, అతడే భగవంతుడని చెప్పబడెను. శంకరులు ప్రతి జీవుడు భగవంతుడే అనెను, ఎందుకంటే అందరూ నాస్తికులే. ఈ విధంగా ఆదిశంకరులు అందరును సత్యముగా కలరు కావున అందరిచే భగవంతుడు కలడు అని తీర్మానింపచేసెను. అనగా ప్రతిజీవుడూ దేవుడే, ప్రతి జీవుడూ ఉన్నాడు, కావున దేవుడు ఉన్నాడు అను మార్గములో నాస్తికులను శంకరులు ఆస్తికులుగా మార్చెను.]

త్వం తత్ త్వమసి తచ్చాస్తి, త్రివాక్యైరాస్తికోఽభవత్ |
సృష్ట్యాదిశక్తిరజ్ఞాన-విక్షేపాత్ న తతోఽర్చనమ్ ||6.4||

[ఆదిశంకరులు మూడు వచనములు చెప్పారు. అ) *నీవు దేవుడవు* ఇ) *నీవు ఉన్నావు* ఉ) *కావున దేవుడు ఉన్నాడు.* ఈ మూడు వాక్యములను అనుసరించి నాస్తికుడు దేవుడు ఉన్నాడని పలికెను. తానే దేవుడు కదా, తాను ఉన్నాడు కదా, అంటే దేవుడు తప్పక ఉండి ఉండాలి!!! తాను దేవుడే అయినప్పటికినీ తనకు అద్భుతమైన, అనూహ్యమైన మహిమలు చేయగల సామర్థ్యం ఎందుకులేదని నాస్తికుడు శంకరులను అడిగినాడు.

దానికి సమాధానమిస్తూ శంకరులు, ఎంతోకాలంగా అజ్ఞానంలో ఉండటం కారణంగా దాని ప్రత్యక్ష ప్రభావము జీవాత్మను భగవంతుని యొక్క పూర్తి శక్తి సామర్థ్యములను పొందకుండా అడ్డగిస్తున్నది. దీనికి పరిష్కారం, జీవులు భగవంతుని ఆరాధించాలి. తద్ద్వారా జీవుని మనసు పరిశుద్ధం అవుతుంది.

అప్పుడు జీవుని కమ్ముకున్నట్టి ఆ ప్రత్యక్ష అజ్ఞానం మాయమవుతుంది. ఈ విధమైన సాధన చేత జీవులందరూ ప్రత్యక్షంగా భగవంతుడే కాగలరు అని వివరించినారు.]

నాస్తికాస్తిక భక్తాంతః , తతో రామానుజో ఒవదత్ |
భక్తిర్ముఖ్యా స తస్యాంశః, దేహవస్త్రాంశతో హరేః ||6.5||

[ఈ విధంగా ఆదిశంకరులు నాస్తికులను ఆస్తికలుగా మార్చడమే కాక ఆస్తికులను భక్తులుగా మార్చినారు. ఈ వేదికను ఏర్పరచిన తర్వాత శంకరులు నిష్క్రమించారు. అప్పుడు రామానుజులు వచ్చి ఆ స్థాయికి అవసరమైన దివ్య ప్రబోధాలను చేశారు. 'భక్తి అత్యంత ప్రాధాన్యత గల విషయం, ఎందుకంటే జీవుడు సంపూర్ణంగా భగవంతుడు కాదు, కాని భగవంతునిలో ఒక సూక్ష్మభాగము మాత్రమే' అన్నారు. దీనిని ఇలా వివరించారు: తన షర్ట్ మీదుగా ధరించిన కోట్ వలె ఉన్న బాహ్య శరీరమునే ప్రపంచముగా వివరించి, జీవాత్మను కోట్ లోని ఒక దారంపోగుగా అభివర్ణించారు. అనగా జీవుడు ఆయన దివ్య శరీరభాగం కాదు అని అర్థము చేసుకొనవలెను.]

ఆత్మా విష్ణోశ్చ జీవో హి, విలీనాత్ పురతః పరమ్ |
నోహ్యా భిన్నా న భిన్నౌ తౌ, శిష్యా భిన్నా మతా విదః ||6.6||

[ఆదిశంకరులు దివ్య శరీరం లేదా నరశరీరములోని ఆత్మనే భగవంతుడు అనెను. అయితే దత్తభగవానుడు తనలో విలీనం అయి విష్ణువుగా మారక ముందు విష్ణువు అను తేజోరూపంలో ఉన్న సాపేక్ష చైతన్యమును ఆత్మ అనెను. దీనిని అనుసరించి ఇట్టి సాపేక్ష ఆత్మ ఏదేని మానవునిలో ఉన్నపుడు ఆ ఆత్మ కూడా భగవంతుడుగా భావింపబడెను. కాని అనూహ్య పరబ్రహ్మమును పొందిన దత్తభగవానుడు, విలీనమైన తర్వాత మాత్రమే తేజోరూపాత్మకుడైన విష్ణువు, భగవంతుడైన విష్ణువు అయ్యేను. ఇట్టి భగవంతుడైన విష్ణువులో దత్తుడు ఉండుట వలన విష్ణువును

విష్ణుదత్తుడనియు పిలచిరి. ఇట్లే బ్రహ్మదత్తుడు, శివదత్తుడుగా బ్రహ్మశివులు పిలువబడిరి. విష్ణువు యొక్క లౌకిక చైతన్య రూపమైన ఆత్మ దత్తుడు విలీనమగుట వలన అనూహ్యమైన చైతన్యముగా మారెను. కావున ఇది ఇతర మానవుల యందు గల సాపేక్ష చైతన్యము (ఆత్మ) కంటే సంపూర్ణంగా భిన్నమైనది. ఈ విధమైన విశ్లేషణ ద్వారా చూసినట్లైతే సిద్ధాంతపరంగా శంకర, రామానుజ, మధ్వులు ఒక్కటే అని, కాని వారి అనుచరులు ఈ విషయసూక్ష్మమును లోతుగా అధ్యయనము చేయక చివరికి పరస్పరం గొడవలతో ముగింపు పలికారని తెలుస్తున్నది.]

రుచేర్భక్తేః ఫలాంశాచ్చ, తృష్ణాంశాదపి భక్తిగాః |
మధ్వాత్ భేద సేవకత్వే, ప్రధాన హనుమత్ పరః ||6.7||

[చాలా కాలంగా భక్తులుగా మారి భగవంతుని భక్తిమాధుర్యాన్ని చవిచూసిన వారైనందున, రామానుజుల కాలంలోని భక్తులు తాము భగవంతునిలో చిన్న భాగమైనా అవ్వాలని ఆశించారు. తాము భగవంతుడు కాగలమని కోరిక గల భక్తుల బలహీనతను శంకరులు పూర్తిగా మంచి కొరకు వాడుకున్నారు. ఇప్పుడు రామానుజులు ఆ విశ్వాసాన్ని పూర్తిగా చెరిపివేయక, కేవలం దానిని అంశగా చేసి చిన్న విశ్వాసము అయ్యేటట్లు కుదించారు. రామానుజులు చెప్పినదే చాలావరకు కొనసాగిస్తూ 'జీవాత్మ పూర్తిగా వేరే జగత్తులోని అంశమనీ, అది భగవంతుడు కాదు లేదా తనలో చిన్న భాగమూ కాదు, అది చేయగలిగిదంతా కేవలం భగవంతుని సేవ మాత్రమే' అంటూ మధ్వాచార్యులు ప్రబోధించారు. హనుమంతుని భక్తిమార్గం పై దృష్టి సారింపజేస్తూ ఆధ్యాత్మిక బోధనలో మధ్వాచార్యులు **సేవ**కు అత్యంత ప్రాధాన్యత నిచ్చారు.]

జ్ఞాన భక్తి కర్మ యోగాః, త్రిభిః ప్రోక్తాః క్రమాదిహ |
శుష్కాఽహంతా చ కాలేన, జీవోంఽతే సేవకో మతః ||6.8||

[ముందుగా ఆదిశంకరులు వచ్చి భావరూప ఆధ్యాత్మిక జ్ఞానము ముఖ్యమైనది అని తెలిపారు. తర్వాత వచ్చిన రామానుజులు భావరూప భక్తి ముఖ్యమైనది అని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన మధ్వులు ప్రత్యక్ష సేవ మరియు కర్మఫల సమర్పణములే ముఖ్యమని బోధించినారు. ఈ విధంగా ఆధ్యాత్మికతకు గల క్రమమును గమనిస్తే మొదటి సోపానం జ్ఞాన యోగము (జ్ఞానం) అని, రెండవ సోపానం భక్తియోగము (భక్తి) అని, మూడవ సోపానం కర్మ యోగము (కర్మ) అని ఆధ్యాత్మిక మార్గదర్శనం అవుతుంది. ఈ మూడు సోపానాల ద్వారా ఆధ్యాత్మిక మార్గంలో నడిచే భక్తులలో కాలక్రమేణా అహంకారము తగ్గుతూ పోయింది. ఎప్పుడైతే జీవాత్మ అహంకారము పడిపోవడం జరుగుతుందో అప్పుడు ఈ మూడు సిద్ధాంతాలు క్రమముగా అవగతము అవుతాయి. ఇలా జీవాత్మ అత్యల్ప అహంకారము గలిగన అంతిమ స్థాయిని చేరి, సత్ప్రవర్తనతో ఇక తాను భగవంతునికి కేవలం సేవకుడనే అనే స్థితికి చేరుతుంది.]

చిత్సామ్యం త్రిమతే భిన్నం, ఊహ్యానూహ్యద సత్సతః |
మతం భ్రమాత్తతో ఒద్వైత-భాగ భేదా ప్రతీయిరే ||6.9||

[మధ్వాచార్యులు జీవాత్మ, పరమాత్మ రెండు వేర్వేరు అంశములని ప్రతిపాదించినప్పటికి ఈ రెండింటి మధ్య చైతన్యము అనే సమానత ఉన్నట్లు అంగీకరించెను. ముందు వచ్చిన ఇద్దరు ఆచార్యులు కూడా రెండింటిని చైతన్య స్వరూపములేనని, అయితే పరమాత్మ వలె కాక జీవాత్మలో, శక్తి సామర్థ్యముల పరిమాణములు అతి స్వల్పముగా ఉంటాయి అన్నారు. అయితే ఇట్టి ప్రతిపాదన జీవాత్మ, పరమాత్మల మధ్య ఏదో ఉమ్మడి స్వభావమున్నది అనే అపోహకు దారితీసింది. యథార్థంగా ముగ్గురు ఆచార్యుల భావనలో పరమాత్మ యొక్క చైతన్యము అనూహ్యమైనది మరియు పరమ యథార్థమైనది. (ఎందుకంటే భగవంతుని చైతన్యమునకు ఆధారభూతమైన అంశములు గాని, కార్యములు గాని (నాడీమండల వ్యవస్థలో జడశక్తి చైతన్య రూపంగా

మారుట) ఏమీ లేవు కావున అనూహ్యము. అనూహ్యమైన పరబ్రహ్మమునకు పదార్థ శరీరము లేని కారణంగా ఆహారము జీర్ణమైన తర్వాత ఉత్పన్నమైన శక్తి మెదడులోని నాడీమండలంలో చేరి విశిష్టమైన పద్ధతిలో చైతన్యమును సృష్టించడం అనే ప్రక్రియ జరగడమే లేదు కావున భగవంతుని చైతన్యము అనూహ్యము).
కాని సృష్టిలో కేవలం ఒక అంశముగా సృష్టించబడిన జీవాత్మలోని చైతన్యము పూర్తిగా ఊహించదగినది, సాపేక్షంగా సత్యమైనది. ఈ రెండు వేర్వేరు చైతన్యములను ఒకటిగా అపోహ పడినందున, 1.జీవాత్మ-పరమాత్మలు చైతన్య స్వరూపములే అని, లేదా 2. జీవాత్మ, పరమాత్మలో స్వల్ప భాగమని లేదా 3. చైతన్యములు సమానమైనా జీవాత్మ, పరమాత్మకు సేవకుడే అని భిన్నమైన అపార్థములు ప్రాచుర్యంలోనికి వచ్చినాయి. ఈ విధంగా త్రిమత సిద్ధాంతములు వేరు వేరని తప్పుగా అర్థం చేసుకోబడినాయి.]

విలీనాదుభయోర్వాదౌ, నైక్యా న్మధ్వే దశాత్రయమ్ |
న జీవే దేయమేతేన, త్రి బాహ్యా లౌకికో ధ్రువమ్ ||6.10||

[శంకరాచార్యులు జీవాత్మ పరమాత్మల మధ్య సమాన స్థాయి కలదని, రామానుజాచార్యులు జీవాత్మ పరమాత్మలో చిన్న భాగమని తెలిపినారు, ఎందుకంటే వారిద్దరు, అనూహ్య పరబ్రహ్మమును తనలో కలిగి ఉన్న దత్తభగవానుని నారాయణునిగా తీసుకున్నారు. అయితే, శంకరులు ఈశ్వరుని జీవచైతన్యం అనూహ్యచైతన్యంగా విలీనం అయిన తరువాత తీసుకున్నట్లు, ప్రతి జీవచైతన్యాన్ని అనూహ్యచైతన్యంగా (నాస్తికులను మార్చుట కొరకు) చెప్పినారు. ఈశ్వరుడు నరావతారంగా మారే సమయంలో ఈశ్వరుని అనూహ్యచైతన్యం కూడ నరుని జీవచైతన్యంతో విలీనమై నరుని ఈశ్వరునిగా మారుస్తున్నది. రామానుజులు దీనిని అంగీకరించక, అనూహ్య పరబ్రహ్మమును ప్రస్తావించక, నారాయణునే (ఈశ్వరునే) భగవంతునిగా తీసుకొని, ఆ నారాయణుని దివ్యశరీరాన్ని

ఆవరించిన విశ్వాన్ని బాహ్యశరీరంగా తీసుకొని, విశ్వంలో చిన్న భాగమైన జీవుని భగవంతుని భాగంగా ప్రతిపాదించినారు. విశ్వమునుండి జీవుని వేరు చేయలేము కావున జీవుని భగవంతుని నుండి వేరు చేయలేమని చెప్పినారు. మధ్వులు విశ్వమును భగవంతుని బాహ్య శరీరంగా భావించక, జీవుని భగవంతునికి బాహ్యంగానే భావించి, ఈశ్వర జీవులకు ద్వైతమును స్థాపించినారు. రామానుజ మధ్వులు ఇరువురూ, అనూహ్య పరబ్రహ్మముపై మౌనం వహించి, నేరుగా నారాయణునితోనే తమ మతములను ప్రారంభించినారు. జీవచైతన్యాన్ని పరమాత్మగా ప్రతిపాదించిన శంకరులు నారాయణుని (ఈశ్వరుడు/ దత్తుడు) అంగీకరిస్తూనే, కేవల మౌనంతో సూచింపబడే పరబ్రహ్మను ప్రతిపాదించినారు. మధ్వాచార్యులు అద్వైత విశిష్టాద్వైతములను నిరాకరించారు. ఎందుకంటే ఒక సాధారణ జీవుడు భగవంతుడు కాడు, భగవంతునిలో భాగము కూడా కాదు. అసలు ఒక సాధారణ జీవాత్మ లో అనూహ్యమైన భగవంతుని చేరికను మధ్వాచార్యులు ఒప్పుకొనలేదు. సత్యమేమిటంటే ఈ మూడు దశలు భగవంతునిచే అనుగ్రహింపబడవలసిన స్థితులే తప్ప సాధారణ మానవుడు తన సామర్ధ్యంతో ఆ దశలను పొందలేడు.]

అవతారే హి తస్యేచ్ఛా, స్వాంశే వా సాధకే ఽథవా |
దశైకాపి దయా దేయా, తస్యైవ న స్వభావతః ||6.11||

[ఒకవేళ ఏదేని జీవాత్మ, పరమాత్మగా మారవలెనంటే, ఆ స్థితిని ఆ ఆత్మకు భగవంతుడే తన ఇచ్ఛచేత ఇచ్చి ఉండవలెను తప్ప జీవాత్మ కోరితే లేదా జీవాత్మ ప్రయత్నిస్తే సాధించగలిగేది కాదు. ఏదేని జీవాత్మ భగవంతుడిగా గుర్తింపబడితే తనను అవతారము (incarnation) లేదా నరశరీరంలో ప్రవేశించుటకు ఊర్ధ్వలోకాల నుండి క్రిందకు దిగివచ్చిన (అవతరించిన) అనూహ్యపరమాత్మ లేదా నరావతారము అని అంటారు. 'అవతరించినది' అంటే భగవంతుడు ఉన్నత స్థితి నుండి క్రిందకు దిగినాడు, తగ్గినాడు (అవరోహణము) అని అర్థము. అంతే తప్ప జీవాత్మ ఆరోహణము

చెంది భగవంతుడైనాడని కాదు. ఈ విధంగా ఆదిశంకరాచార్యుల అద్వైతమతం పూర్తిగా అసత్యం కాదు, అయితే ఈ స్థితిని స్వయంగా భగవంతుడే తనంతతట తాను కోరి అనుగ్రహించాలి తప్ప అన్యథా సంభవం కాదు. అదే విధంగా ఏదేని జీవాత్మ భగవంతునిలో చిన్న భాగం అయినదని చెప్పబడితే, ఆ సందర్భంలో కూడా భగవంతుడే తనంతతట తాను కోరి ఆ జీవాత్మకు తనలో చిన్నభాగముతో సమాన స్థితిని అనుగ్రహించినాడు అని అర్థం. అదే విధంగా భగవంతుడు ఎవరినైనా తన ప్రియమైన సేవకుడుగా ఎంచితే ఆ స్థితి కూడా కేవలం భగవంతుని కోరిక మేరకు ప్రసాదించబడినదే. కావున ఈ మూడింటిలో ఏదైనా ఒక దివ్య స్థితిలో జీవాత్మ ఉండటం అనేది కేవలం భగవంతుని అనుగ్రహం చేత కలిగిన యోగమే తప్ప జీవాత్మ సహజంగా కాని, లేదా తనంతతట తాను సాధించగలిగినది కాదు. జీవుడు తన ప్రయత్నములచేత భగవంతుని సేవకస్థానమును పొందవచ్చును. అయితే, సేవలో స్వచ్ఛతను చూచి భగవంతుడే సేవకస్థానమునను అనుగ్రహించవలెను. ఇక ఆపై జీవుని భాగముగా చూచుట, పూర్ణ అద్వైత పదమును ఇచ్చుట కేవలము భగవంతుడే స్వేచ్ఛతో అనుగ్రహించవలెను.]

దశాదేయాఽవతారశ్చ, భాగశ్చ సేవకస్తథా |
దేహాంశ స్యోపమా దృశ్యా, ప్రథమాంతౌ తు సత్తయా ||6.12||

[ముగ్గురు దివ్య ఆధ్యాత్మిక గురువులు (సద్గురువులు) తెలిపిన జీవాత్మ యొక్క విశేషస్థితులు జనులందరికీ స్వాభావికంగానే వర్తిస్తాయని మానవులు అపోహ పడ్డారు, మానవులలో ఇది ప్రాథమిక దోషం. భగవంతునిచే ఎన్నుకోబడిన ఒకానొక విశేషమైన భక్తునితో దత్తుడు విలీనము అయితే, రాముడు లేదా కృష్ణుడు మొదలైన వారుగా భగవంతుడు అవతరిస్తాడు. భగవంతుడు ఎన్నుకున్న ఒకానొక భక్తుడు ఆదిశేషుడు, లేదా లక్ష్మణుడు మొదలైన వారి వలె భగవంతునిలోని భాగముతో సమానముగా చూడ బడగలడు. ఇక్కడ భాగము అంటే శాబ్దిక అర్థంలో భాగమని కాదు, ఎందుకంటే భగవంతుడు అవిభాజ్యుడు.

(**అవిభక్తం విభక్తేషు**...భగవద్గీత). భక్తుడు, సృష్టినే బాహ్య శరీరంగా ధరించిన భగవంతుడు మరియు సృష్టించబడిన మిగిలిన అన్ని జీవులతో పాటు బాహ్యవిశ్వము అను భగవంతుని సృష్టిలో భాగమే అయి ఉన్నాడు. ఉదాహరణకు, భగవంతుడైన రామునికి, లక్ష్మణుడు తన కుడిభుజమని ఉపమానంగా తెలిపాడు. అలాగే లోకంలో ఒక తండ్రి ఇద్దరు కొడుకులను తన రెండు కళ్ళు అంటాడు. అలాగే భగవంతుని చేత విశేషంగా అనుగ్రహింపబడిన ఒకానొక విశేష జీవుడు, హనుమంతుడు, గరుత్మంతుడి వలె భగవంతుని సేవకుడు కాగలడు. అంతే తప్ప, లోకంలోని సాధారణమైన ప్రతి ఒక్క జీవాత్మ ఈ స్థితిని పొందలేదు. ఒకటవ, మూడవ బోధకుల సందర్భంలో ఉపమానం లేదు, ఎందుకంటే మొదటి సందర్భంలో (శంకరులు) స్వయంగా భగవంతుని నోటనే జీవాత్మ 'భగవంతుడు' అని చెప్పబడెను. మూడవ సందర్భంలో (మధ్వులు) స్వయంగా భగవంతుని చేతనే ఒకానొక విశేషమానవుడు భగవంతుని సేవకుడుగా ఎంచబడెను.]

దోషో భక్తేన గురుణా, గుణాశ్చ జీవకర్మసు |
అద్వైతా ద్వైర్యమాపత్తు, సుగుణాశ్చ ప్రవర్తనే ||6.13||

[ముగ్గురు దివ్య ఆధ్యాత్మిక బోధకులలో ప్రతి ఒక్కరి తత్త్వము కూడా బోధకుని దృష్టితో చూసినట్లయితే అన్నీ చక్కని యోగములు. ఈ మూడు తత్త్వములను సాధకుని దృష్టితో చూసినట్లయితే కొంత అయోగ్యత ఆపాదించబడుతుంది. ఒకానొక సందర్భంలో వ్యాకులమైన ఒకని ఆత్మ, 'తానే ప్రత్యక్షంగా భగవంతుడు' అన్న ఆదిశంకరాచార్య ప్రబోధాలను అనుసరించినట్లయితే, వ్యాకులత నుండి రక్షింపబడి అతను ఉత్తమ ఆత్మవిశ్వాసమును తిరిగి పొందగలడు. నిజానికి అప్పుడు అతను ఎంతో దివ్యత్వమును కూడా ప్రదర్శించును. తనలో సహజంగా ఉన్న చెడువాసనలను అధిగమించి స్వయంగా భగవంతుని వలె ఉదాత్తమైన సద్గుణములతో వ్యవహరించగలడు.]

సదుద్దేశో గురు శ్శిష్యై, వక్రీకృత్య న సత్పథా |
ఆస్తికః పాపకృ జ్జీవః, శంకరా త్సమజాయత ||6.14||

[ఆదిశంకరాచార్య జగత్తును మిథ్య అన్నారు. ('అస్తిత్వము ఉన్నది' అని కాదు, అలాగని 'అస్తిత్వము లేనిదీ' కూడా కానిది మిథ్య). దీని అర్థము ఏమిటంటే జగత్తు తనంతతట తానుగా అస్తిత్వము లేనిది, కాని భగవంతుని నుండి యథార్థమైన అస్తిత్వమును ఉదారంగా పొందినది. జగత్తు లోపల ఆత్మ ఒక చిన్న భాగం అయినప్పటికీ అది జగత్తును మిథ్య అనుకొని తనను తాను యథార్థమైన సత్యమని, భగవంతుడిని అనీ భ్రమించినది. ఆదిశంకరాచార్యులు వీరి అపార్థమును అనుమతించారు. జగత్తు మిథ్య అయినపుడు ఇక జీవులు పాపము చేసి ప్రాపంచిక సుఖములను పొందాలని ఆశించరు, అని భావించినారు. **కాని** జీవులు పాపములు కూడా మిథ్య అని భావించారు మరియు తామే భగవంతుడైనందున పాపములకు శిక్ష విధింపబడదు అని విశ్వసించారు. ఈ విధంగా మానవులను ఉద్ధరించుటకు దివ్య ఆధ్యాత్మిక గురువుగా వచ్చిన పరమాత్మ మంచిని కోరి తత్త్వమును ప్రబోధించితే, జీవాత్మలు అదే తత్త్వమును వ్యతిరేకంగా అర్థం చేసుకుని అందులో నుండి చెడును ఎంచుకున్నారు. ఈ విధంగా జీవాత్మ తానే యథార్థంగా భగవంతుడినని, జగత్తు మిథ్య అని నమ్మి సోమరిగా మారెను.]

పరా ద్భక్తి ర్మనోభావః, బుద్ధో జ్ఞానాఘ కర్మభిత్ |
అహంతాంఽశా న్న నష్టా చ, న పృథక్కారణాదపి||6.15||

[రామానుజాచార్యులు భగవంతుని పట్ల భావరూప భక్తిని ప్రబోధించారు, ఎందుకంటే భావరూప భక్తి భగవంతుని పట్ల భక్తినే కాక భయమును కూడ కలుగజేస్తుంది. ఇప్పటివరకు జీవుడు తన గత మార్గములో తానే భగవంతుడనని భావిస్తూ భయము లేకుండా పాపము చేయగలిగినాడు. రామానుజాచార్యులు ఇచ్చిన భావరూప భక్తి కేవలం మనసుకు సంబంధించినది కావున దీనిని అనుసరించి భక్తులు భగవంతునికి ఏ ప్రత్యక్ష సేవ

చేయకపోయినా మానసికంగా భక్తిభావనను (భావరూప భక్తి) వృద్ధి చేసుకున్నారు. ఇది వారి అహంకారమును పూర్తిగా తొలగించలేక పోయింది, ఎందుకంటే రామానుజాచార్యులు జీవాత్మ, పరమాత్మలోని విడదీయలేని చిన్న భాగమే అని ప్రబోధించారు.]

అద్వైతాకాశ మధ్యస్థ, విశిష్టాద్వైత విశ్రమః |
ద్వైతభూమౌ స్థితో జీవః, సోఽహంకార వ్యయక్రమః ||6.16||

[మధ్వాచార్యులు జీవాత్మ-పరమాత్మ చైతన్యములలో ఎలాంటి సమానత్వము లేదని తెలిపి జీవాత్మ పరమాత్మలో ఎప్పటికీ భాగం కాలేదని బోధించి, జీవుల అహంకారమును సంపూర్ణంగా తొలగించినారు. ఈ విధంగా జీవులు ఆదిశంకరాచార్యులు తెలిపిన అద్వైతమనే ఆకాశం నుండి క్రిందికి పడి, రామానుజాచార్యుల మధ్యస్థమైన ఆకాశకేంద్రంలో (space station) పడినారు. మధ్వాచార్యుల కారణంగా - చిట్టచివరికి భూమిపైకి వచ్చి నిలిచారు. జీవాత్మ ఆకాశంలో ఉన్నపుడు అత్యంత అహంకారంతోను, మధ్యస్థ ఆకాశ కేంద్రంలో పడినపుడు తక్కువ అహంకారముతోను, భూమి మీదకు చేరినపుడు అత్యల్ప అహంకారంతోను ఉంటుంది. ఈ విధంగా అహంకారం క్రమేపీ తగ్గుతూ వచ్చి చివరికి దాదాపు శూన్యస్థితికి చేరింది.]

భక్తేర్నిరూపణం సేవా, హనుమాన్ పురత స్స్మృతః |
నరావతార ఏతేన, రామః ఖ్యాతః క్రియాపరా ||6.17||

[సేవ, (ప్రత్యక్షంగా క్రియాత్మకంగా భగవంతునికి చేయబడునది), జీవాత్మ యొక్క భావరూప భక్తిని ధ్రువీకరించగల ఏకైక సాక్ష్యం అని బోధించి సేవకు మధ్వాచార్యులు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. అందుకే వారు హనుమంతునికి ప్రాముఖ్యత ఇచ్చి, ఆధ్యాత్మిక మార్గంలో భగవంతునికి, జీవాత్మ చేయు సేవయే అత్యంత ముఖ్యకార్యం అని బోధించినారు. మానవావతారమైన శ్రీరామునికి హనుమంతుడు సేవ చేసినందున, 'భగవంతుడు వర్తమాన నరావతారంగా' వస్తాడనే భావన కూడా మధ్వులు

ప్రతిపాదించినట్లయింది. ఈ విధంగా 'ప్రపత్తి' అనగా భగవంతునికి, జీవుడు చేయు ప్రత్యక్ష సేవకు మధ్వాచార్యులు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు].

బుద్ధి రాదౌ పరంచేతః, సర్వస్వం కర్మ యోగతః |
అతః ఫలం కర్మణో హి, ద్వయం దోహద కారణమ్ ||6.18||

[ఆదిశంకరాచార్యులు తన ప్రబోధములలో బుద్ధి, జ్ఞానములకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. నిజానికి జీవాత్మ, జ్ఞానమును సాధించడమే తన అంతిమ లక్ష్యంగా ఉండినది, ఎందుకంటే నాస్తికులకు భక్తిగాని, భగవంతుని సేవ గాని గిట్టవు. రామానుజాచార్యులు జీవాత్మ యొక్క మనసు మీద దృష్టిని సారించి భావరూప భక్తిని ప్రబోధించినారు. అప్పటికే నాస్తికులు అంతా ఆస్తికులుగా (శంకరుల వలన), మరియు పరమభక్తులుగా (రామానుజుల వలన) మారినారు, కాని వారికి భగవంతునికి సేవ చేయడం అంటే గిట్టదు ఎందుకంటే వారు పరమాత్మ కానీ లేక పరమాత్మలో భాగంగా గానీ ఊహించుకొనుచున్నారు. అలాంటి భావనలో పూర్తిగా భిన్నమైన వారికి సేవ చేయుట పొసగదు. మధ్వాచార్యులు ప్రత్యక్ష సేవకు ప్రాధాన్యత ఇచ్చారు. సేవ అంటే భగవంతునికి జీవాత్మ చేయగల క్రియారూపసేవ (కర్మసన్యాసము) మరియు సమర్పణము (కర్మఫలత్యాగము). ఎందుకంటే అప్పటికే భావరూప భక్తిలో పండిపోయి ఉన్న భక్తులు భగవంతునికే ప్రత్యక్ష భక్తి, సేవలు చేయగల పరిపక్వస్థితిని పొందారు. కావున ఆధ్యాత్మిక మార్గంలో కర్మసన్యాసము మరియు కర్మఫలత్యాగములతో కూడిన ప్రత్యక్ష సేవలకే తుదిఫలితం ఇవ్వబడుతుంది. జ్ఞానము మరియు భావరూప భక్తిక్రమములు, భగవంతుని యందు ప్రత్యక్షమైన భక్తిని కలిగించి, ప్రత్యక్షసేవ చేయుటకు, తద్ద్వారా జీవాత్మ అంతిమఫలితం పొందుటకు సహాయపడగల సోపానములు మాత్రముగా నిలిచినవి.]

పశ్యంతో లిఖితం శిష్యాః, న తత్కాలావృత స్థితిమ్ |

హితే సిద్ధాంత వక్రత్వాత్, వివాద కలహం గతాః ||6.19||

[ఈ ముగ్గురు ఆచార్యుల శిష్యులు, అనుయాయులు వారు బోధించిన తత్త్వము పైనే దృష్టి కేంద్రీకరించారు కాని వారి వారి కాలములలో ఉన్న జీవుల పరిస్థితుల మీద కాదు. జనులను సరైన ఆధ్యాత్మిక మార్గంలో నడపాలంటే దివ్యమైన ఆధ్యాత్మిక గురువులు వారిని చేరిన శిష్యుల స్థాయిని బట్టి చెప్పదలిచిన తత్త్వమును త్రిప్పి చెప్పవలసిన అవసరం ఉంటుంది. త్రిమతములను ఆచరించే వేర్వేరు సాధకులు వారి వారి సద్గురువుల సమయంలో ఉన్న శిష్యుల స్థాయి, పరిస్థితులను గమనించకుండా పరస్పరం గొడవలు పడుతుంటారు].

శంకరస్య పాన బోధః, త్రయోపి బ్రహ్మణో గతః |
దయయా త్రిఫలాన్యేతే, న సిద్ధాని స్వయం నృణామ్ ||6.20||

[నాస్తికులను ఆస్తికులుగా మార్చుటకు, ప్రతి జీవుడు భగవంతుడే అన్నారు ఆదిశంకరాచార్యులు. తాను శివదత్తుడనని (శివోఽహం) తెలిపి, ఒకరోజు మద్యమును తాగారు. శిష్యులందరూ తాము కూడా శివదత్తుడే అంటూ(శివోఽహం) శిష్యులు కూడా మద్యమును తాగారు. మరుసటి రోజు ఆదిశంకరాచార్యులు కరిగించిన సీసము త్రాగి శిష్యులను కూడా త్రాగమన్నారు. అప్పుడు వారు తమ తప్పును తెలుసుకుని గురువు గారి పాదములపై పడినారు. అప్పుడు శంకరాచార్యులు, తాను మాత్రమే శివదత్తుడనని (శివః కేవలోఽహం) బోధించారు. ఆదిశంకరాచార్యులు స్వయంగా పరమశివుని అవతారము, కావున అద్వైత సిద్ధాంతము తనకు పూర్తిగా వర్తిస్తుంది. ఏ ఆదిశేషుడు తనలో చిన్న భాగమని భగవంతుడు తెలిపాడో, అంతటి ఆదిశేష అవతారమే రామానుజాచార్యులు. కావున వారు ప్రతిపాదించిన సిద్ధాంతము, 'జీవుడు పరమాత్మ లో భాగము' అనే తన రామానుజ సిద్ధాంతమే, తనకు పూర్తిగా వర్తించును. భగవంతుని సేవకుడైన వాయుదేవుని అవతారంగా వచ్చిన మధ్వాచార్యులు బోధించిన 'జీవుడు భగవంతుని సేవకుడనే' సిద్ధాంతము మధ్వాచార్యులకు

వర్తిస్తుంది. ఈ విధంగా మూడు తత్త్వములలో బోధింపబడిన 'జీవాత్మలు పొందగల స్థాయి' అనునది భగవంతుడు మెచ్చిన విశేషభక్తులకు స్వయంగా అనూహ్యమైన భగవంతుడు ప్రసాదించే అద్భుతమైన కానుక. జీవాత్మలందరూ తమతమ శక్తిసామర్థ్యముల కారణంగా ఈ మూడు స్థితులను పొందలేరు. భగవంతుని అనుగ్రహం ఉంటే తప్ప, ఈ స్థితులను ఏ జీవాత్మ తనంతట తాను సాధించలేదు.]

ఇతి త్రైలోక్యగీతాయాం 'త్రిమతసమన్వయయోగో' నామ షష్ఠాధ్యాయః

ఈ విధంగా త్రైలోక్యగీత యందు 'మూడు దివ్యమతముల మధ్య సమన్వయము' అను యోగము పూర్తి అయినది.